# వ్యాస కౌముది



## మనభారతం

డా.వల్లూరుపల్లి శివాజీరావు

**26**

ఈ భూమండలంలో అద్వితీయమైన,అసమానమైన సంపద, నాగరికత, సంస్కృతి, జ్ఞాన, విజ్ఞాన ప్రతిభలతో వేలాది సంవత్సరాలు(బ్రిటన్ మనదేశాన్ని కబళించడం మొదలు పెట్టిన 1757 వరకూ) తులతూగిన మన భారతదేశపు ఔన్నత్య చరిత్రగురించి నేను వ్రాసిన "ది గ్లోబల్ ఇండియా" అనే పేరుతో ఉన్న పుస్తకం జూలై 2009లో ఇండియాలో ప్రచురించబడింది. ఈ పుస్తకం అందరికీ అందుబాటులో ఉండదని భావించి అందులో పొందుపరిచిన కొన్ని ముఖ్యాంశాలని తెనుగులోకి అనువాదం చేసి 'కౌముది' మాసపత్రిక ద్వారా మీకు అందిస్తున్నాను.

ధారావాహికంగా వచ్చే ఈ ఉపాఖ్యానాలని మీరు చదివి, మీ పిల్లలకుకూడా తెలియచెప్పమని నా విన్నపం. ఈ విధంగా ఘనమైన మన భారతదేశ చరిత్ర భావితరాలకు కూడా చేరుతుందని నా చిన్న ఆశ..!!




### ప్రాపంచిక శాస్త్ర, వైజ్ఞానిక, సాంకేతిక రంగాలలో భారతావని సాధించిన అద్భుత పరిశోధనా ప్రగతి – IX

### విశ్వవిద్యాలయాలు (Universities)

యూరోపియన్లు భారతదేశం, చైనాలలో కంటే తమ దేశాలల్లోనే ప్రపంచంలో అతి పురాతనమైన విశ్వవిద్యాలయాలున్నాయని గట్టిగా నమ్ముతారు. అలా అనుకుని చాలా గర్వపడతారు కూడా. హార్వర్డ్, ఆక్స్‌ఫర్డ్, కేంబ్రిడ్జ్, ప్రిన్స్‌టన్, యేల్, స్టాన్‌ఫర్డ్ లాంటి విద్యాలయాలకంటే కొన్ని వేల ఏళ్ళకు/శతాబ్దాల కంటే ముందే భారతావనిలో అనేక విశ్వవిద్యాలయాలు వర్ధిల్లి ప్రపంచకీర్తినార్జించాయి. ఇవి ప్రసాదించిన విజ్ఞానమే ప్రపంచం నలుమూలలకూ విస్తరించింది.

యూరోప్‌లో అన్ని విద్యాలయాలకంటే అతిపురాతనమైనది గ్రీసు '**విద్యాపరిషత్తు**' (Academy). దీనిని గ్రీకు తత్త్వ వేదాంతి సోక్రటీస్ శిష్యుడు 'ప్లేటో' (Plato) క్రీ.పూ. 387లో 'ఏథెన్స్' (Athens) దగ్గరలో ఉన్న Akademia ఒక 'Olive' చెట్ల తోపులో

స్థాపించాడు. తత్త్వశాస్త్రం (philosophy), గణితశాస్త్రం, ఖగోళశాస్త్రం, జిమ్నాస్టిక్స్, మొదలగు విభాగాలలో ఈ విద్యాపరిషత్తు బోధించింది. ఈ విద్యాసంస్థే తరువాతి కాలంలో యూరోప్‌లో ఉద్భవించిన విద్యాలయాలకు మార్గదర్శి అయింది. అనేక గ్రీకు సాంప్రదాయాలను అనుసరిస్తున్న రోమన్లు తమ విద్యాలయాలలో కూడా గ్రీకు విద్యా పరిషత్తును అనుకరించింది. 1-2 శతాబ్దాలలో Stoics మరియు ఇతర రోమన్ తత్త్వశాస్త్రజ్ఞుల వర్గాలలో తలెత్తిన అంతర్గత విబేధాలు, కలహాలవల్ల ఈగ్రీకు విద్యాలయం తన ఉనికిని కోల్పోయింది. ఆతరువాత దీనిని రోమన్లు పునరుద్ధరించినా రాజు 'జస్టీనియన్' (Justinian) క్రీ.శ. 526లో పూర్తిగా మూసివేశాడు.

మరొక భారతేతర పురాతన విద్యాసంస్థ ఈజిప్ట్‌లోని 'అలెగ్జాండ్రియా'లో Ptolemy II Philadelphus (క్రీ.పూ. 309-246) పాలనలో స్థాపించబడిన Royal Library. ఈయన తండ్రి (Ptolemy I Soter) పరిపాలనాకాలంలో స్థాపించిన 'Musaeum' (House or Temple of Muses) అనే ఆధ్యాత్మిక కేంద్రంలోనే ఈగ్రంధాలయం స్థాపించబడింది. ఈ Musaeum నుండే 'మ్యూజియం' పదం ఉత్పన్నమైంది. ఈ గ్రంధాలయమే *Cyperus papyrus* అనే మొక్కలోని బెండు (pith)తో కాగితాన్ని పోలిన దానిని తయారుచేసిన 'పాపిరస్' (Papyrus) ను మొట్టమొదట వ్రాతకు ఉపయోగించి, దానిని ప్రపంచానికిచ్చింది. కాని క్రీ.పూ. 48లో 'జూలియస్ సీజర్' ఈగ్రంధాలయంలో కొంత భాగాన్ని అగ్నికి ఆహుతి చేశాడు. అప్పటినుండి 7 శతాబ్దాలపాటు అది అంచెలంచెలుగా విధ్వంసానికి గురి కాబడి, చివరకు క్రీ.శ. 642లో మహమ్మదీయ ఉన్మత్తులదాడి కారణంగా సమూలంగా అంతరించిపోయింది.

## భారత విశ్వవిద్యాలయాలు

భారతావనిలో ప్రాచీన, మధ్యయుగ కాలాలో వర్ధిల్లిన విశ్వవిద్యాలయాలలో ముఖ్యమైన తక్షశిల, నలంద, వల్లభి, విక్రమశిల మొదలగునవి.

### తక్షశిల విశ్వవిద్యాలయం

ఈజగత్తులో అతి పురాతన విశ్వవిద్యాలయం **తక్షశిల** అని నిస్సందేహంగా చెప్పవచ్చు. ఇది ఇప్పటికీ నిర్ధారించబడని కాలంలో 'గాంధార' (ఆఫ్ఘనిస్తాన్‌లోని 'కాంధహార్')రాజ్యంలో స్థాపించబడింది. భారత చారిత్రకుల పరిశోధనల మేరకు ఈ విద్యాలయం పుట్టుక రామాయణ కాలం (క్రీ.పూ.4000-3500) అని ధృవపడింది. శ్రీరాముడి సోదరుడు భరతుడు ఆయన భార్య 'మాండవి' (సీత చెల్లెలు)కి జన్మించిన పుత్రుడు '**తక్ష**' పేరు మీద ఈవిద్యాలయాన్ని స్థాపించడం జరిగింది. ఈయన తన చిన్న కొడుకు '**పుష్కళ**' పేరు మీద '**పుష్కళావతి**'అనే నగరాన్ని కూడా స్థాపించాడు. గాంధార రాజ్యానికి రాజధాని అయిన పుష్కళావతి ఈరోజున పాకిస్తాన్ లోని పెషావర్ ('పురుషపుర' లేక 'పరాశ్వర')కు 29 కి.మీ. లో ఉన్న Charsadda ప్రాంతమే.

క్రీ.పూ. 3100 ప్రాంతంలో అర్జునుడి మనుమడు, అభిమన్యుడి పుత్రుడు '**పరీక్షత్తు**' తక్షశిలలో సింహాసనాన్ని అధిష్టించాడని మహాభారతం ఉటంకించింది. పరీక్షత్తుని పుత్రుడు'**జనమేజయుడు**' కొన్నాళ్ళు ఇచ్చట రాజసభను నడిపాడు. ఆసమయంలోనే 'వైశంపాయన' మహర్షి ఆయనకు మహాభారత యుద్ధాన్ని వర్ణించాడు కూడా. ఆధునిక కాలంలో 'తక్షిల' (Taxila) అనబడే ఈతక్షశిల ప్రస్తుతం పాకిస్తాన్ లోని 'ఇస్లామాబాద్' కు 30 కి.మీ. (19మైళ్ళు) దూరంలో ఉన్న ఒక చిన్న పట్టణం.

తక్షశిల విశ్వవిద్యాలయం గురించి క్రీ.పూ. 700 వరకు చాలా తక్కువే తెలుసు. బౌద్ధ గ్రంధాలు (Jatakas) ఈ కాలంలో తక్షశిల అతి పెద్దదైన విద్యాపీఠంగా ప్రసిద్ధి పొందిందని పేర్కొన్నాయి. ఈవిద్యాలయం విశాల భారతావనిలోని అన్ని ప్రదేశాలనుండే గాక గ్రీస్, బాబిలోనియా, సిరియా, ఈజిప్ట్, చైనా, అరేబియా, మొదలగు దేశాల విద్యార్థులనుకూడా ఆకర్షించింది. మధ్యఆసియా, పశ్చిమఆసియా,

కాశ్మీరంలతో సంబంధాలున్న తక్షశిల నుండి పాటిలీపుత్రకు రాజమార్గం ఉండేది. ఈదారే కాలక్రమేణా 'గ్రాండ్ ట్రంక్ రోడ్డు' అయింది.

వేదాలు, తత్త్వశాస్త్రం, సంస్కృత వ్యాకరణం, వైద్య-శస్త్ర శాస్త్రాలు, ఖగోళశాస్త్రం, గణితశాస్త్రం, జ్యోతిషశాస్త్రం, విలువిద్య, యుద్ధ శాస్త్రం, రాజకీయశాస్త్రం, ఆర్థికశాస్త్రం, వాణిజ్యం, రసాయనశాస్త్రం, భౌతికశాస్త్రం, క్షుద్రవిద్య శాస్త్రం (Occult Science), 18 కళా విభాగాలు, మొదలగు విభిన్న శాఖలలో ఈ విద్యాలయం ఏడాదికి కనీసం 10,500 మంది విద్యార్థులకు బోధించింది. ఇందులో చేరటానికి కనీస ప్రవేశార్హత 16 సంవత్సరాలు. విద్యను ప్రారంభించటానికిగాక పూర్తిచేయటానికే విద్యార్థులు తక్షశిల వేళ్ళేవారు. ఇచ్చటకు వచ్చే విద్యార్థులు కేవలం సంపన్నులేకాదు, పేద, బలహీన కుటుంబాలకు చెందినవారు కూడా.

అక్కడకి దేశం నలుమూలలలోని వివిధ రాజకుమారులు విలువిద్య, ఆర్థికశాస్త్రం, యుద్ధశాస్త్రం, పరిపాలన వంటి శాఖలలో అధ్యయనం చేయటానికి కోకొల్లలుగా వచ్చేవారు. వారిలో అతిముఖ్యులు క్రీ.శ. 321లో మౌర్య వంశ స్థాపకుడు '**చంద్రగుప్త మౌర్య**'; కోసల దేశపు రాజు '**ప్రసేనజిత్**' (క్రీ.పూ. 6వ శతాబ్దం); ఆయుర్వేద, యోగశాస్త్ర నిపుణుడు, బుద్ధుడి ప్రధాన వైద్యుడు '**జీవక కుమార భచ్చ**' (మగధరాజు బింబిసారుడు-ప్రేయసి, రాజనర్తకి 'శలావతి'కి కలిగిన పుత్రుడు; క్రీ.పూ. 6-5 శతాబ్దాలు). అధ్యాపకులతో పాటు, విద్యార్థులు కూడా విద్యాలయంలోనే నివసించేవారు. విద్యార్థులు అత్యంత క్రమశిక్షణకు లోనయ్యేవారు. గురు-శిష్య పరంపరలో విద్యా బోధన జరిగింది. చాలా శాఖలలోని విద్యార్థులు 7 సంవత్సరాల పాటు విద్యనభ్యసించేవారు.

తక్షశిల కీర్తి ప్రతిష్టలు వారి వారి శాఖలలో బోధన జరిపిన, ప్రఖ్యాతి గాంచిన పండితులు, అధ్యాపకులు, నిపుణుల ద్వారానే ఇనుమడించాయి. ఇటువంటి కీర్తి ప్రతిష్టులైన అధ్యాపకులవల్లనే సమాజంలోని సమస్త వర్గాలు, శ్రేణులు, హోదాల ప్రజా సముదాయంలోని సమర్థులైన విద్యార్థులు సుదూర ప్రయాణం చేసి, కష్టాలనధిగమించి ఈ విశ్వవిద్యాలయానికి వచ్చేవారు.

ఉన్నత ప్రమాణాలతో వర్ధిల్లిన ఈతక్షశిల వేలాది సంవత్సరాలు ప్రపంచ మేధస్సుకు ఆధిపత్యం వహించిందటే అప్పుడూ, ఇప్పుడూ భారతీయులకు గర్వకారణమైన విషయం. మానవ మేధస్సుకు రాజధాని అయిన తక్షశిలలో భారత్‌లోని అన్నిప్రాంతాలనుండి అధ్యాపకులు వచ్చి బోధించేవారు. ఈ నిష్ణాతులలో కొందరు 'జీవక కుమార భచ్చ'; సంస్కృత వ్యాకరణ పండితుడు, 'అష్టాధ్యాయ' గ్రంధ రచయిత 'పాణిని' (క్రీ.పూ. 520-460); చంద్రగుప్త మౌర్యుని గురువు, ప్రధానమంత్రి, అర్థశాస్త్ర నిపుణుడు, 'చాణక్యుడు' (కౌటిల్యుడు; క్రీ.పూ. 350-275); 'పంచతంత్ర'రచయిత 'విష్ణుశర్మ'(క్రీ.పూ. 3వ శతాబ్దం). ప్రపంచ ఖ్యాతి గాంచిన మహా గ్రంధం '**అర్థశాస్త్ర**'ను కౌటిల్యుడు ఇక్కడే రచించాడు.

అశోకునికాలంలో తక్షశిల విద్యాలయంమీద బౌద్ధమత ప్రభావం పడినందువల్ల అప్పటినుండి బౌద్ధమత తత్త్వశాస్త్ర విద్యాబోధన కూడా జరిగింది. ఇచ్చటే మహాయానశాఖ స్థాపన జరిగింది. మహాయాన బౌద్ధ తత్వవేత్త, మాధ్యమిక శాఖ స్థాపకుడు, ఆంధ్రుడు అయిన నాగార్జునుడు (క్రీ.శ. 78-170; 150-250) ఇక్కడ ఆచార్యుడుగా ఉన్నాడు.

క్రీ.పూ. 518లో పర్షియన్ వాయువ్య Darius I (పాలన క్రీ.పూ. 521-486) భారత భూభాగంలోని గాంధార, కాంభోజ రాజ్యాలను ఆక్రమించినప్పుడు తక్షశిల ఆయన పాలనలోకి వచ్చింది. అప్పుడు ఈరెండు రాజ్యాల రాజులు Achaemenid సామ్రాజ్యానికి 7వ సామంతులుగా ఉన్నారు. క్రీ.పూ. 380లో Artaxerxes II (క్రీ.పూ. 404-359 4) పాలనలో పర్షియన్ పట్టు క్షీణించినప్పుడు గాంధార తిరిగి హిందూరాజుల పాలనలోకి వచ్చింది. కాని క్రీ.పూ. 326లో అలెగ్జాండర్ (క్రీ.పూ. 356-323) దండెత్తినప్పుడు హిందూ రాజు

'ఆంభి' (Ambhi; గ్రీకులకు Omphis) విద్యానిలయమైన తక్షశిలను విధ్వంసం నుంచి రక్షించటానికి మాసిడోనియా రాజుకు లొంగిపోయి అనేక బహుమతులతోపాటు కొన్ని ఏళ్ళు కప్పం చెల్లించుకున్నాడు.

కాని అలెగ్జాండర్ స్వాధీనం ఎంతో కాలం నిలువలేదు. క్రీ.పూ. 317లో చంద్రగుప్త మౌర్య వాయువ్య భారతావనిని తన అధీనం లోకి తెచ్చుకున్నప్పుడు తక్షశిల తిరిగి భారతీయుల చేతుల్లోకి వచ్చింది. క్రీ.పూ. 183 నుండి గాంధార రాజ్యం మొదట Greco-Bactrian రాజుల అధీనంలోనూ, తరువాత, Indo-Scythian, Indo-Parthian, కుషాణ రాజుల పాలనలలో ఉండిపోయింది.

సుమారు 4000 ఏళ్ళ ఘనచరిత్రగల ఈ అతి ప్రాచీన భారత విశ్వవిద్యాలయం క్రీ.శ. 455లో స్కంద గుప్తుని పాలనలో క్రౌర్యా నికి ప్రతినిధులు, మధ్య-ఆసియా దేశద్రిమ్మరులు అయిన శ్వేత హూణులు (White Huns; Hephthalites) 'తోరమన' (Toramana) నాయకత్వంలో సమూల విధ్వంసానికి బలి అయింది. బ్రిటిష్ పురావస్తు శాస్త్రజ్ఞుడు 'జాన్ మార్షల్' 1902-1928 మధ్య సరస్వతీ-సింధూ ప్రాంతాలలో జరిపిన త్రవ్వకాలను పరిశీలించి తక్షశిల విధ్వంసాన్ని ఇలా వర్ణించాడు: "ఈ విధ్వంస కాండ ఖచ్చితంగా కిరాతక తెల్ల హూణుల వల్లనే జరిగింది. వీరు క్రీ.శ. 455లో భారతావనిలో సుడిగాలిలా ప్రవేశించి అన్నిచోట్లకు కత్తులు, నిప్పును వెంటబెట్టుకు వెళ్ళారు...... ఆ ఉపద్రవం నుంచి తక్షశిల తిరిగి కోలుకోలేదు."

**భారత సంస్కృతికి, నాగరికతకు, ఆధ్యాత్మికతకు వేలాది ఏళ్లు అద్దం పట్టి నిలయమైన ఈ అపరూప తక్షశిల ఈరోజున మనదేశ భూభాగంలో లేదంటే కించిత్ బాధ మనలో ఉండదా?**

## నాలందా విశ్వవిద్యాలయం

క్రీ.శ. 427లో మగధ సామ్రాజ్యంలో స్థాపించబడి అనేక శతాబ్దాలు వర్ధిల్లిన మరొక భారత విద్యా నిలయం '**నాలందా**' విశ్వవిద్యాలయం. వాడుకలో 'నలంద' గా మారిన ఈపట్టణం బీహార్‌లోని పాట్నాకు 80 కి.మీ. దూరంలో ఉంది.

విశ్వవిద్యాలయం స్థాపించబడక ముందు బుద్ధుడు నాలందాలో ఒక బౌద్ధ విహార (monsatery)ను స్థాపించి దీనిని అనేక పర్యా యాలు దర్శించినప్పుడు '**పావారిక**'మామిడి తోటలో ఉండేవాడు. ఒక సంవత్సరంపాటు ఆయన అచ్చట నివసించాడు కూడా. ఈబౌద్ధ విహారలోనే ఆయన శిష్యులు 'మౌద్గలయాయనుడు', 'శారిపుత్ర' పండితులయ్యారు. క్రీ.పూ. 250 ప్రాంతంలో అశోక చక్రవర్తి శారిపుత్రకు స్థూపాన్ని నిర్మించాడు. ఇచ్చట జన్మించిన శారిపుత్ర నిర్యాణం చెందాడు కూడా. జీనమత తీర్థంకర 'మహావీర' కూడా అనేకసార్లు నాలందాలో నివసించాడు. పావాపురి లోనే ఈయనకు మోక్ష సిద్ధి జరిగింది.

మహాయాన శాఖకు కేంద్రమైన నాలందా గుప్త రాజుల కాలంలో ప్రాముఖ్యతను సంతరించుకొంది. వందలాది ఏళ్ళు బౌద్ధ విహారగా ఉన్న నాలందాకు కుమార గుప్తుడి (413-455) కాలంనుండి ఒక విద్యాకేంద్రంగా రూపు దిద్దుకుంది. ఈ గుప్త రాజు 427లో ఒక లలిత కళల కళాశాలను స్థాపించి ధర్మనిధిని ఏర్పాటు చేశాడు. ఈయన ఉత్తరాధికారి 'స్కందగుప్త' (455-467) పాలనలో 'మిహిరకుల' నాయకత్వంలో దండెత్తిన హూణుల చేతుల్లో జరుగబోయే నాలందా విధ్వంసాన్ని నిరోధించాడు.

ఆతరువాత ఇది విస్తరించబడి పైన పేర్కొన్నట్లు ఒక ప్రముఖమైన విశ్వవిద్యాలయంగా మారింది. 200 గ్రామాలనుండి లభించే ఆదాయం ఈవిద్యాలయానికే శాశ్వతంగా చెందేటట్లుగా గుప్తరాజులు ఏర్పాటు చేశారు. వాస్తుశిల్ప-పర్యావరణ అద్భుత శకలం

(architactural and environmental masterpiece)గా కీర్తించబడిన ఈవిశ్వవిద్యాలయంలో 8 విడివిడిగాఉన్న భవన సముదాయాలు, 10 దేవాలయాలున్నాయి. ఉఛ్ఛస్థితిలో ఉన్న కాలంలో 8,500 మందికి తగ్గని నివాస విద్యార్థులు, 1,570 మంది అధ్యాపకులతో ఈవిద్యాకేంద్రం కళకళలాడుతూ ఉండేది. అంతేగాక, 9 అంతస్తులున్న 'ధర్మగంజ్' అనే విజ్ఞాన విభాగంలో మూడు గ్రంధాలయాలు (రత్న సాగర; రత్నోదధి, రత్నరంజక)న్నాయి. '**జ్ఞాన ప్రావీణ్యాన్ని ప్రసాదించే తావు**' అనే అర్థం నిబిడీకృతమైన నాలందా ఆకాలంలో అంతర్జాతీయ విద్యాలయంగా పేరు గాంచి చైనా, జపాన్, శ్రీలంక, మంగోలియా, కొరియా, ఇండోనేసియా, వియత్నాం, టిబెట్, టర్కీ, పర్షియా, ఈజిప్ట్, రోం, గ్రీస్, తదితర దేశాల విద్యార్థులను ఆకట్టుకుంది. ఇందులో విద్యార్థులకు ప్రవేశార్హత 20 సంవత్సరాలు.

12.5 హెక్టార్ల(30 ఎకరాల) విస్తీర్ణంలో ఉన్న నాలందాలో సనాతనధర్మం, బౌద్ధమతం, జీనమతం, వేదాలు, ఉపనిషత్తులు, సాంఖ్యతత్వశాస్త్రం, వైశేషిక దర్శన, న్యాయ దర్శన, సాహిత్యం, భౌతిక శాస్త్రం, రసాయన శాస్త్రం, ఆధ్యాత్మవిద్య, చికిత్సవిద్య, హేతు విద్య, యాంత్రిక విద్య (mechanics), యోగవిద్య, మొదలగు వైవిద్య భరితమైన శాఖలలో విద్యాబోధన జరిగింది. దీనిలో ప్రవేశించగోరే అభ్యర్థులు వ్యాకరణం, గద్య వచనం, కవిత్వం, తర్కం, అధిభౌతిక శాస్త్రం (metaphysics)లలో నిష్ణాతులయి ఉండాలి.

హర్షవర్ధనుడి కాలంలో నాలందాలో 5 ఏళ్ళు (635-640) విద్యనభ్యసించి, 12 ఏళ్ళు భారత్‌లో పర్యటించిన చైనా యాత్రికుడు హుయత్సాంగ్ (Hsuan Tsang) ఈవిద్యాలయాన్ని ఇలా వర్ణించాడు: ".....ప్రవేశ పరీక్షలో 20 శాతం పైచిలుకు విద్యార్థులు ఉత్తీర్ణులయ్యే వారు కాదు..... ఇందులో ప్రవేశం పొందటం చాలా కష్టం....కొండంత ఎత్తులో ఉండి ఆకాశాన్ని చుంభించే గోపురాలు (minarets), చిహ్నాలు (obelisks) గుమ్మటాల (domes)తో ఉన్న ఈవిశ్వవిద్యాలయం ఒక శాంతి ద్వీపం....ఉదయాన ప్రయోగశాలనుంచి పైకి వెళ్ళే పొగలతో నిండి, చల్లటి పిల్లగాలులు పెద్దకిటికీల ద్వారా వీశాయి. స్వచ్ఛమైన నీరున్న సరస్సులలో వికసిస్తున్న పద్మాలు నాలందా సౌదర్యాన్ని ఇనుమడించాయి. సర్పాకార మెట్లతో ఉన్న నాలుగు అంతస్థుల భవనంలో అధ్యాపకులు నివసించారు......ఏ దేశానికైనా నాలందా గర్వ కారణం." ఈ హుయత్సాంగ్ చైనా తిరిగి వెళ్ళేటప్పుడు 657 బౌద్ధగ్రంధాలను వెంట తీసుకువెళ్ళాడు!

కాంచీపుర బ్రాహ్మణుడు, బౌద్ధ తర్కశాఖ స్థాపకుడు 'దిగ్నాగ' (క్రీ.శ. 480-540); దిగ్నాగ శిష్యుడు, కాంచీపురవాసి, బౌద్ధ యోగాచార శాఖ పండితుడు 'ధర్మపాల'(క్రీ.శ. 530-561) నాలందాలో ప్రధానాచార్యులుగా ఉండేవారు. నాలందాలో ఇతర కీర్తిగాంచిన బౌద్ధాచార్యులు, బోధకులలో 'ఆర్యదేవ' (3వ శతాబ్దం; యోగాచారశాఖ స్థాపకులలో ఒకరు); 'వసుబంధు' (3వ శతాబ్దం, మహాయానలో యోగాచారశాఖ సిద్ధాంతకర్త); 'శిలాభద్ర' (7వ శతాబ్దం); 'ధర్మకీర్తి' (7 వశతాబ్దం, తత్త-తర్క శాస్త్రజ్ఞుడు); 'చంద్రపాల'; 'స్త్రిమన్'; 'గ్యాన్‌చంద్ర'; 'పద్మసంభవ' (8వ శతాబ్దం, టిబెట్‌లో వజ్రయానశాఖను ప్రవేశపెట్టినవాడు), 'చంద్ర గోమెన్' (Chandragomen); 'కమలశీల' (8 వశతాబ్దం); 'బుద్ధకీర్తి'; 'కుమారశ్రీ'; 'సుమతీసేన్' లాంటి నిష్ణాతులు, పండితులు కూడా ఉన్నారు. శాంతరక్షిత టిబెట్ రాజు 'Grin—Di-ut Tsan'ఆహ్వానం మేరకు అచటకు వెళ్ళి జీవితాంతం బౌద్ధమత స్థాపనకు కృషి చేశాడు.

9 శతాబ్దాల పాటు ప్రముఖ బౌద్ధ విహార, నిలయంగానూ, ఆతరువాత 7 శతాబ్దాలు పైగా ఖ్యాతి గాంచిన అంతరాతీయ భారత విద్యాలయాన్ని క్రూరత్వం నిండిన టర్కీ మహమ్మదీయ నాయకుడు, డిల్లీని రాజధానిగా చేసుకొని పాలించిన మొట్టమొదటి మహమ్మదీయుడు కుతుబుద్దీన్ అయ్‌బక్ (Qutb-ud-din Aybak) సేనాపతి, అనుయాయుడు 'భక్తియార్ ఖిల్జీ' 1193లో దయా దాక్షిణ్యం

లేకుండా సమూలంగా నాశనం చేశాడు. బౌద్ధమతాన్ని పెకలించివేసి దాని స్థానంలో తన మహమ్మదీయ మతాన్ని నిలపాలనే కాంక్షతో వేలాది బౌద్ధ పండితులు, సన్యాసులను సమిధలుగా మార్చి, 200 పైగా బోధనాచార్యులను హతమార్చి, వందలాది బౌద్ధ సంస్థలను పడగొట్టాడు. ధర్మగంజ్ పుస్తక భాండాగారం మూడు నెలలు మండుతూ, లక్షలాది గ్రంధాలను తగులబెట్టగా వచ్చిన నల్లటి పొగ కొన్ని వారాలపాటు ఆకాశాన్ని కమ్మివేసింది!

ఈ ధాటిని తట్టుకుని బ్రతికున్న బౌద్ధ సన్యాసులు వెంటనే నాలందాను పునరుద్ధరణ చేస్తే, నాలుగేళ్ళ తరువాత (1197లో) తిరిగి వచ్చిన ఖిల్జీ రెండవసారి దండెత్తి దానిమీద చావుదెబ్బ కొట్టాడు. ఈ సమూల విధ్వంసం తరువాత వివిధ బౌద్ధ దేశాల విద్యార్థులు తాము సంపాదించిన పాండిత్యంతోపాటు అగ్నికి ఆహుతి కాని గ్రంధాలు, ఈసంస్థ అవశేషాలను తమతమ దేశాలకు తీసుకుపోయారు. ఈ విద్యాలయపు చివరి ముఖ్యాధికారి 'శక్య శ్రీభద్ర' 1204లో టిబెట్ పారిపోయాడు.

నాలందాను పునరుద్ధరణచేసి పూర్వవైభవాన్ని తెచ్చే ప్రయత్నంలో భారత ప్రభుత్వం వేలాది కోట్ల రూపాయల వ్యయంతో నోబెల్ గ్రహీత 'అమర్త్యసేన్'ఆధ్వర్యంలో 2013 నాటికి ఒకక్రొత్త భవన సముదాయాన్ని నిర్మించే ప్రయత్నంలో ఉంది.

## వల్లభిపుర విశ్వవిద్యాలయం

సౌరాష్ట్ర (గుజరాత్)లో గుప్తరాజులకు సేనాపతిగా ఉండి, వీరు బలహీనులయినప్పుడు క్రీ.శ. 470లో స్వతంత్రుడయి '**వల్లభిపుర**' (ఇప్పటి 'వల') లో 'మైత్రక' వంశపు రాజ్యాన్ని స్థాపించిన '**భటారక**' (పాలన 462-482) ఈ విశ్వవిద్యాలయాన్ని 475లో ప్రారంభించాడు. బౌద్ధమతానికి ప్రత్యేక ప్రోత్సాహమివ్వబడిన ఈ విద్యాలయం 'హీనయాన' శాఖకు కీలక కేంద్ర మయింది. తరువాత వచ్చిన మైత్రక రాజులు (ఒకప్పుడు పర్షియానుండి వలస వచ్చిన 'మిహిరలు'గా భావించబడిన పారిశీకులు) ఈవిద్యాలయం మీద అమిత వ్యయంచేసి దీనిని ఆకాలంలో నాలందాకు దీటుగా నిలిపారు. దేశ, విదేశ విద్యార్థులున్న వల్లభిలో సనాతన ధర్మంలో అప్పుడు ఉన్న 6 శాఖలలోని విజ్ఞానంతో పాటు బౌద్ధశాఖలు, రాజకీయశాస్త్రం, న్యాయశాస్త్రం, వ్యవసాయశాస్త్రం, ఆర్థికశాస్త్రం మొదలగు విభాగాలలో బోధన జరిగింది. 7వ శతాబ్దం మధ్యలో 'గుణమతి', 'స్థిరమతి' వల్లభిలోని పేరెన్నికగన్న బౌద్ధచార్యులు.

చైనా యాత్రికుడు హ్యుయత్సాంగ్ "....అత్యధిక జనాభా, సిరిసంపదలతో విలసిల్లిన వల్లభినగరంలో 6,000 మంది బౌద్ధసన్యాసులు నివసించారు....100 విహారాలున్నా, హిందూ దేవాలయాలే ఎక్కువగానే ఉన్నాయి. బౌద్ధులకంటే, హిందువులే ఎక్కువ మంది ఉన్నారు... అన్ని మతాలవారు పొరపొచ్చాలు లేకుండా కలిసిమెలిసి ఉన్నారు" అని పేర్కొన్నాడు. 700 వందల ఏళ్ళకు పైగా వర్ధిల్లిన ఈ విశ్వవిద్యాలయం భక్తియార్ ఖిల్జీ చేతిలో నాలందాకు పట్టిన గతే పట్టి చరిత్ర గర్భంలో కలిసిపోయింది.

## ఇతర ప్రాచీన విద్యాలయాలు

8వ శతాబ్ధం నుండి బెంగాల్, బీహార్ ప్రాంతాలనేలిన 'పాల' వంశ రాజులు బౌద్ధమతానికి అత్యధిక ప్రాధాన్యత ఇచ్చి బౌద్ధమతంలో ప్రత్యేకమైన బోధనకు కొన్ని మహావిహారాలను స్థాపించారు. వీటిల్లో విక్రమశిల, 'ఉద్దండపుర', 'సోమపుర', 'జగ్గదల' ప్రముఖమైనవి. ఒకవిధంగా వల్లబిపుర విద్యాలయంకూడా బౌద్ధ మహావిహారగానే పరిగణించబడింది.

బీహార్ లోని ఉత్తర మగధరాజ్యంలో భాగల్పూర్‌కి దగ్గర క్రీ.శ. 800 ప్రాంతంలో స్థాపితమైన **విక్రమశిల** కేవలం 400 ఏళ్ళు మాత్రమే వర్ధిల్లింది. దీనిని బౌద్ధసన్యాసి '**కామపాల**' అధ్వర్యంలో '**పాల**' వంశపు రాజు, మహాయాన బౌద్ధ మతస్తుడు అయిన

'ధర్మపాల' (పాలన 783-820) స్థాపించాడు. బౌద్ధమతాన్ని ప్రధానంగా బోధించే ఈవిద్యాలయంలో 6 విభాగాలున్నాయి. ప్రతి విభాగంలో 150 అధ్యాపకులున్నారు. దీని చుట్టూ ఎత్తయిన కోటగోడలు, 6 ప్రవేశ ద్వారాలున్నాయి. విద్యార్థులు జీతం చెల్లించనవసరం లేకపోగా వారికి ఉచిత నివాసం, భోజన సౌకర్యాలుండేవి. ఈ విద్యానిలయం మధ్యలో 'విద్యాగృహ'అని పేరుతో ఉన్న ఒక'ఉపన్యాస భవనం' ఉండేది.

ఆరుగురు 'ద్వార పండితులు' నిర్వహించే ప్రవేశ పరీక్ష ద్వారా అర్హత పొందిన విద్యార్థులు తమకిష్టమైన అంశాలు, శాఖలలో విద్యను నేర్చుకోవచ్చు. వీటిల్లో 'తంత్రయాన' బౌద్ధశాఖ కూడా ఉంది. బౌద్ధవిద్యాబోధనలో విక్రమశిల నాలందాకు సమానంగా ఉండేది. ఈవిద్యానిలయంలోని కీర్తి గాంచిన ప్రధానాచార్యుడు 'దీపాంకర శ్రీజ్ఞాన' (మరో పేరు 'అతిష దీపాంకర'; క్రీ.శ. 980-1054). ఈయన అచ్చట బోధించినకాలంలో విక్రమశిల బంగారుబాటలో పయనించి అంతర్జాతీయ కీర్తి ప్రతిష్ఠలనందుకొంది. 1041లో అతిష టిబెట్ రాజు Dromtönpa ఆహ్వానం మేరకు అచ్చటకు వెళ్ళి జీవితాంతం క్షీణదశలో ఉన్న బౌద్ధమత పునరుద్ధరణ, వ్యాప్తికి కృషి చేసి 'లాసా' దగ్గర అసువులు బాశాడు. ఈ బౌద్ధవిద్యాలయాన్ని కూడా **భారత విద్యానిలయ విధ్వంసక చక్రవర్తి** భక్తియార్ ఖల్జీ 1203లో సమూలంగా నాశనంచేసి మళ్ళీ తలెత్తుకోకుండా చేశాడు!

వాడుకలో '**ఒదంతపుర**' గా మారిన '**ఉద్దండపుర**' విద్యాలయాన్ని 'పాల' వంశ స్థాపకుడు 'గోపాల'(పాలన 750-770) బీహార్‌లోని మగధలో స్థాపించాడు. ప్రముఖ బౌద్ధ మహావిహారగా పేరుగాంచిన ఈవిద్యానిలయం ఉచ్చస్థితిలో ఉన్నప్పుడు 12,000 మంది విద్యార్థులుండేవారు. 400 ఏళ్ళు వర్ధిల్లిన ఒదంతపుర విద్యాలయం కూడా 1193లో భక్తియార్ ఖల్జీ దమన కాండకు బలయింది.

ఇప్పటి బంగ్లాదేశ్‌లో క్రీ.శ. 9వ శతాబ్దం ప్రారంభంలో పాల వంశపు రాజు 'ధర్మపాల' చేత స్థాపించబడిన '**సోమపుర**' బౌద్ధ మహావిహార 400 ఏళ్ళు బౌద్ధ ప్రపంచంలో పేరు గాంచి, 13 శతాబ్దం ప్రారంభంలో భారీ అగ్ని ప్రమాదానికి బలిఅయి చివరకు క్షీణదశకు చేరుకుంది.

పాల వంశపు రాజు 'రామపాల' 1080 దశకంలో ప్రముఖ '**జగ్గదల**' బౌద్ధ మహావిహారను స్థాపించాడు. వజ్రయాన బౌద్ధ శాఖను ప్రముఖంగా అనుసరించి, కేవలం 120 ఏళ్ళు మాత్రమే నిలబడిన జగ్గదల విద్యాలయం కూడా 1204లో భక్తియార్ ఖల్జీ జరిపిన విధ్వంసంవల్ల క్షీణించింది.

(వచ్చే సంచికలో **సముద్రయానం, నౌకా నిర్మాణం, వాణిజ్యం** మొదటి భాగంలో పొందుపరచిన విషయాలను పరిశీలిద్దాం)

మీ అభిప్రాయాలను పంపించేందుకు నా ఇ-మెయిల్: **dr_vs_rao@yahoo.com**




రామాయణకాలం తదుపరి స్థాపించబడి, తరువాత ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన తక్షశిల విశ్వవిద్యాలయానికి కేంద్రమైన 'తక్షశిలానగరం' ఈనాడు భారతావనిలో గాక పాకిస్థాన్ అంతర్భాగమైపోయింది. ఇప్పుడు దీని పేరు 'తక్షిల'(Taxila - నీలిరంగు).



క్రీ.పూ. 200-100 నాటి తక్షశిల నాణెం.



బుద్ధుడి కాలంలో బౌద్ధవిహారగా పేరొంది, గుప్తరాజు కుమారగుప్తుడి కాలంలో పాట్నాకు 80 కి.మీ. దూరంలో విద్యాకేంద్రంగా రూపుదిద్దుకుని, 770 ఏళ్ళు ఒక ప్రముఖమైన విశ్వవిద్యాలయంగా ప్రపంచ ఖ్యాతి గాంచి, 1193 లో 'భక్తియార్ ఖల్జీ' చేతిలో సమూలంగా నాశనమైన నాలందా విశ్వవిద్యాలయం.



9 అంతస్తులున్న 'ధర్మగంజ్' విజ్ఞాన విభాగంలో ఉన్న మూడు గ్రంథాలయాలలోని ఒక నాలందా గ్రంథాలయ భవనం.




Share your comments